# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేది : 08-01-2026 సమయం : 6.45 గంటలు

## ముఖ్యాంశాలు

- అమరావతికి రాజధానిగా చట్టబద్ధత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేశారు.
- ఆంధ్రప్రదేశ్ లో మరిన్ని ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
- విజయవాడలో జరిగే "ఆవకాయ్ అమరావతి" ఉత్సవాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభిస్తారు.
- సంక్రాంతి రద్దీ దృష్ట్యా 6 వేల 431 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ వెల్లడించింది.

----------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో నిన్న ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించిన ముఖ్యమంత్రి అమరావతికి రాజధానిగా చట్టబద్ధత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరడమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధి కూడా వేగవంతం అవుతుందని ఆయన వివరించారు.అలాగే, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన 'జీ-రామ్-జీ' పథకంలోని నిబంధనలపైనా చంద్రబాబు నాయుడు చర్చించారు. ఈ పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాను 60:40 నిష్పత్తికి మార్చడం వల్ల, ఆంధ్రప్రదేశ్‌పై ప్రతికూల ప్రభావం పడుతుందని రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, ఈ విషయంలో ప్రత్యామ్నాయ ఆర్థిక వెసులుబాటు కల్పించాలని కోరారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లో మరిన్ని ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించిన ఎంఎంఎస్ఈ శాఖ అభివృద్ధి కార్పొరేషన్ ఎండీల బాధ్యత

స్వీకరణ కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్త అంశానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు.

వాయిస్ ..25 సెకన్లు

-----------------------

తెలంగాణలో రానున్న రెండు సంవత్సరాల్లో అర్హులైన పేదలందరికీ మరో రెండు విడతల్లో ఇళ్లు ఇస్తామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న 2 వేల 160 ఇందిరమ్మ ఇళ్లను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే తొలి విడత ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని.. మరో విడత ఏప్రిల్‌లో ఇవ్వనున్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి విడతగా 22 వేల 500 కోట్ల రూపాయలతో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులకు దశల వారీగా ప్రతి సోమవారం బిల్లులు చెల్లిస్తున్నామని మంత్రి వివరించారు.

-----------------------

తెలుగు సినిమా, సంస్కృతి, సాహిత్య వైభవాన్ని తెలిపేలా విజయవాడ వేదికగా " ఆవకాయ్ అమరావతి" ఉత్సవాలను ఈరోజు నుంచి నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ -ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట తెలిపారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ రోజు నుంచి శనివారం వరకూ మూడు రోజుల పాటు పున్నమి ఘాట్, భవానీ ద్వీపంలో వైభవంగా ఈ వేడుకలు నిర్వహించనున్నామని చెప్పారు. తెలుగు సంస్కృతి,సంప్రదాయాలను యువతకు తెలియజేయడంతో పాటు సాహిత్యం, తెలుగు ప్రజలను ప్రభావితం చేసిన సినిమాల గురించి ఈ సందర్భంగా చర్చించనున్నారని తెలిపారు. ఈ రోజు రాత్రి కృష్ణానది ఒడ్డున పున్నమి ఘాట్ దగ్గర జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, యూరోపియన్ యూనియన్ రాయబారి హెచ్ఈ హెర్వే డెల్ఫిన్ పాల్గొంటారని తెలిపారు.

-----------------------

మధ్యప్రదేశ్ మాండ్లా పార్లమెంట్ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ ఫగ్గన్ సింగ్ కులస్తే ఆంధ్రప్రదేశ్

ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గం పరిధిలోని సదుంలో మధ్యప్రదేశ్ వాసులు గ్రానైట్ తవ్వకాలకి అనుమతులు పొందారని, స్థానిక నాయకులు మైనింగ్ ప్రక్రియను అడ్డుకుంటున్నారని ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై పవన్ కళ్యాణ్ స్పందిస్తూ, దేశంలో ఏ రాష్ట్రం వారైనా ఆంధ్రప్రదేశ్ లో పనులు చేసుకోవచ్చని  స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడైనా అయినా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. స్థానికేతరుల పేరిట అనుమతులు ఉన్నప్పటికీ పనులు చేసుకోనివ్వకుండా అడ్డుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లోని పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలలో వచ్చే ఏడాది ఎంబిబియస్ ప్రవేశాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం-సియస్‌యస్ కింద రాష్ట్ర ప్రభుత్వమే పిడుగురాళ్ల కళాశాలను నిర్మించి, నిర్వహించనుందని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం పిడుగురాళ్ల కళాశాలకు 195 కోట్ల రూపాయల సహాయాన్ని మంజూరు చేసి రాష్ట్రానికి విడుదల చేసిందని

పేర్కొన్నారు.మొదటి దశలో పిడుగురాళ్ల వైద్య కళాశాలలో 100 ప్రవేశాలు కల్పించి అనంతరం అదనపు ప్రవేశాల కోసం చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు.

-----------------------

సంక్రాంతి రద్దీ దృష్ట్యా 6,431 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ -టీజీఎస్ఆర్టీసీ ఒక ప్రకటనలో వెల్లడించింది. పండగకు నడిపే ప్రత్యేక బస్సుల్లో అదనపు ఛార్జీలు ఉంటాయని 9, 10, 12, 13 తేదీలతో పాటు 18, 19 తేదీల్లో మాత్రమే పెంచిన ఛార్జీలు అమలవుతాయని పేర్కొంది. మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుందని తెలిపింది.

-----------------------

ప్రకృతి పర్యాటకానికి ఆంధ్రప్రదేశ్ అనుకూలమని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండల పరిధిలోని దివాన్ చెరువులో ఉన్న అటవీ భూమిని పురంధేశ్వరి నేతృత్వంలో ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో నిన్న

పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యాటకుల కోసం రాజానగరంలో జంతు ప్రదర్శన శాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాజానగరంలో సుమారు 311 హెక్టార్ల అటవీ సంరక్షణ ప్రాంతం ఉందని, చెప్పారు. అందులో 250 హెక్టార్ల భూమిని జూపార్కు కోసం వినియోగించుకునే ప్రతిపాదనకు సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం పరిశీలించిందని పురంధేశ్వరి పేర్కొంటూ,

వాయిస్ .. 30 సెకన్లు

-----------------------

స్వయం సహాయక సంఘాల మహిళలు ఉపాధి పొందేలా, వారు తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు వేదికగా సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిజన్స్ సొసైటీ- సరస్ మేళా ఈ రోజు నుంచి జరగనుంది. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ -మెప్మా ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఈ ప్రదర్శన నిర్వహిస్తోంది. గుంటూరు మిరపకాయను మేళాకు చిహ్నంగా ఎంపికచేశారు. ఈ రోజు నుంచి ఈ నెల 18వ తేదీ వరకు 10 రోజుల పాటు జరిగే ఈ మేళాలో అన్నిరాష్ట్రాల నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యుల ఉత్పత్తులు, హస్తకళలు, చేనేత వస్త్రాలు, ఆహార పదార్థాల

దుకాణాలను ఏర్పాటు చేసారు. మొత్తం 300 స్టాళ్లు ఏర్పాటు చేయగా రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలకు 150, ఇతర రాష్ట్రాల వారికి 150 స్టాళ్లను కేటాయించారు.

----------------------

ఆగ్నేయ బంగాళాఖాతంలో శ్రీలంకకు సమీపంలో ఏర్పడిన అల్పపీడనం.. అదే ప్రాంతంలో కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది రానున్న 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా మారి, పశ్చిమ వాయవ్య దిశగా నైరుతి బంగాళాఖాతం వైపు కదిలే అవకాశముందని తెలిపింది. దీని ప్రభావంతో రేపు, ఎల్లుండి ఆంధ్రప్రదేశ్లోని దక్షిణ కోస్తా రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణం శాఖ తెలిపింది.

----------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. రాష్ట్ర సచివాలయం ఆర్థిక శాఖలో విధులు నిర్వహించే ఉద్యోగి అకాల మృతి నేపథ్యంలో ఉద్యోగి కుటుంబ సభ్యులకు వ్యక్తిగత ప్రమాద బీమా పథకం క్రింద కోటి రూపాయల నగదు చెక్కును మంత్రి నిన్న అందజేశారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఏడాదికి సగటున 150

మంది మరణించడం ప్రభుత్వం గుర్తించిందన్నారు. వారి కుటుంబాలకు ప్రైవేటు రంగ పరంగా మరింత లబ్దిని చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అందరికీ వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని వర్తింపజేసేలా పలు బ్యాంకులతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =